ప్రీమియం భారం.. రైతన్న దూరం

- రైతుల నుంచి పంట బీమాకు స్పందన కరువు
- వరి ఎకరాకు రూ. 800 ప్రీమియం
- 28 వేల ఎకరాలకు గానూ ఇప్పటికీ 115 మంది నమోదు
- గత ప్రభుత్వంలో నూరు శాతం నమోదు
- పూర్తిగా బీమాను చెల్లించిన వైఎస్సార్ సీపీ


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

పొన్నూరు: భూమిలో విత్తనం నాటిన నుంచి పంట చేతికొచ్చే వరకూ అన్నదాతలకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతాయి. వాటిని అధిగమిస్తూ, కష్టనష్టాలను భరిస్తూ ముందుకు సాగాలి. సాగు నీటి కష్టాలు, విత్తనాల కొరత, ఎరువులు దొరక్క పోవడం, తుపానులు.. ఇలా అనేక సుడిగుండాలను దాటాలి. ఆ సమయంలో ప్రభుత్వం అండ చాలా అవసరం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలిచారు. పంట సాగులో మొదటి నుంచి చివరి వరకూ తోడున్నారు. వాటిలో పంటల బీమా గుర్తించి ప్రధానంగా చెప్పుకోవాలి. రైతుల తరఫున ప్రభుత్వమే ప్రీమియం కట్టింది. దీంతో ఆ ఐదేళ్లు రైతులకు పూర్తి భరోసా లభించింది. కానీ నేటి కూటమి ప్రభుత్వం భారాన్ని రైతులపై మోపింది. దీంతో ఒక శాతం మందికి మాత్రమే బీమా ధీమా లభిస్తోంది.

అన్నదాతల ఆవేదన

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అనేక హామీలిచ్చారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని వాగ్దానం చేశారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా, ఆ ఊసే మరిచారు. పంటల బీమా ప్రీమియాన్ని రైతులే కట్టుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉచితంగా పంట బీమా పొందిన రైతులందరూ చంద్రబాబు తీరుతో గగ్గోలు పెడుతున్నారు. అసలే వ్యవసాయానికి పెట్టుబడి డబ్బులు లేక ఇబ్బంది పడుతుంటే, ఇక బీమా ప్రీమియం ఎలా చెల్లించాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరువైన స్పందన

పొన్నూరు మండలంలో సుమారు 28 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. రైతులు 11,490 మంది రైతులున్నారు. ప్రధానంగా వరి పంట సాగవుతోంది. అయితే, ఇప్పటికీ కేవలం 115 మంది మాత్రమే బీమా ప్రీమియం చెల్లించారు. ఎకరానికి వరి పంటకు రూ. 800 చెల్లిస్తే రూ. 40 వేల వరకు పంట బీమా అందుతుందని అధికారులు చెబుతున్నారు. ఇది కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది. అసలే అప్పులు చేసి పంటలు పండిస్తున్నామని, బీమాకు పెట్టుబడి ఎక్కడ పెట్టగలమనే భావన రైతుల్లో వ్యక్తమవుతోంది. టీడీపీ పాలనలో బీమా చెల్లించడం దండగా అనే అభిప్రాయం కూడా వారిలో ఉంది. గతంతోనూ టీడీపీ అధికారంలో ఉండగా రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించినా, పరిహారం దక్కిన పరిస్థితులు లేవని రైతులు చెబుతున్నారు. ఇక ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితే ఉంటుందనే భావం నెలకొంది. దీంతో ప్రభుత్వం ప్రకటించిన పంట బీమా పథకానికి రైతుల నుంచి స్పందన కరువైంది.

గతంలో అందరికీ...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మొదటి సంవత్సరం ఒక రూపాయి చెల్లించి బీమాలో పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పింది. ఆ తర్వాత నుంచి రైతుల తరఫున ప్రభుత్వమే ఐదేళ్లపాటు ప్రీమియం చెల్లించి ఉచిత పంటల బీమాను అమలు చేసింది. దీంతో రైతులకు కూడా ధీమా కలిగేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



పంటల బీమా పథకానికి ప్రీమియం చెల్లించాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటినా ఇప్పటి వరకు 115 మంది మాత్రమే చెల్లించారు. మరికొంతమంది ఆన్‌లైన్‌లో వారి అకౌంట్లు ద్వారా చెల్లింపులు జరిగాయి. ప్రీమియం చెల్లించడం వల్ల ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలకు కలిగే నష్టాలకు పరిహారం లభిస్తోంది.

–ఆర్. వెంకటేశ్వరరావు,
మండల వ్యవసాయాధికారి, పొన్నూరు

‘తొలి అడుగు’లో సమస్యల వెల్లువ


కరపత్రాలను అందజేస్తున్న మంత్రి ఎండీ ఫరూక్

చేబ్రోలు: స్థానిక ముస్లిం ఏరియాలో రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎండీ ఫరూక్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌లు బుధవారం పర్యటించారు. ప్రభుత్వం చేపట్టిన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఏడాది పాలనలో చేపట్టిన కార్యక్రమాలపై కరపత్రాలను స్థానికులకు అందజేశారు. పలువురు సమస్యలను మంత్రి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. త్వరితగతిన వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మైలా రామరాజు, చందు శ్రీరాములు, ఖాదర్ బాషా, పఠాన్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ బుధవారం అందించారు. మండల పరిధిలోని శలపాడు, వడ్లమూడి, వేజండ్ల, నారాకోడూరు, గుండవరం, గొడవర్రు, చేబ్రోలు, శ్రీరంగపురం, తోట్లపాలెం గ్రామాలకు చెందిన 19మందికి రూ.15,86,325 విలువైన నగదు చెక్కులను ఆయన అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మధ్యవర్తిత్వంతో కేసులకు సత్వర పరిష్కారం



పొన్నూరు: మధ్యవర్తిత్వంతో కేసులను సత్వరమే పరిష్కరించుకోవచ్చని న్యాయవాది డి. విజయ్‌కుమార్ తెలిపారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఏకా పవన్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం న్యాయ సంబంధిత అంశాలపై అవగాహన కల్పించేందుకు పట్టణంలోని కోర్టు ప్రాంగణం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు న్యాయవాదులు వన్ కే వాక్ నిర్వహించారు. అనంతరం గ్రామీణ బ్యాంకులో అవగాహన సదస్సు నిర్వహించారు. కక్షిదారులకు మధ్యవర్తిత్వంతో లభించే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కోర్టు సూపరింటెండెంట్ ఏ. రాజ్యలక్ష్మి, బ్యాంకు మేనేజరు చైతన్య, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ షేక్ బాజీసాహెబ్, ఎంహెచ్ఎస్. సాయిబాబు, మగ్బుల్ బేగ్, జి. శ్రీనివాసరావు, ఎస్. శ్రీనివాసరావు, సిబ్బంది, కక్షిదారులు, న్యాయవాదులు, గుమస్తాలు, పాల్గొన్నారు.

నీటి తీరువా వసూలు వేగవంతం చేయాలి



కాకుమాను: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా నీటి తీరువా వసూలు వేగవంతం చేయాలని తహసీల్దార్ బి.వెంకటస్వామి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 11 రెవెన్యూ గ్రామాలకు గానూ ఇప్పటిదాకా నాలుగింటిలోనే నీటి తీరువా పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన గ్రామాల్లోనూ ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. వీఆర్వోలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేసి అన్నదాత సుఖీభవ, కౌలు రైతులను గుర్తించి, వారందరికీ సీసీఆర్సీ కార్డులు మంజూరు చేయాలని ఆయన సూచించారు. బియ్యం కార్డులకు ఈకేవైసీ పూర్తి చేసి లాగిన్ నుంచి ఫార్వార్డ్ చేయాలని తెలిపారు. విధి నిర్వహణలో అశ్రద్ధ వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మండలాభివృద్ధికి పాటుపడాలి



చేబ్రోలు: మండలాభివృద్ధే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పని చేయాలని చేబ్రోలు మండల పరిషత్ అధ్యక్షురాలు కొక్కిలగడ్డ సాహితి తెలిపారు. మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఆమె అధ్యక్షతన బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఎంపీడీవో ఊహారాణి మాట్లాడుతూ అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, తాగు నీరు తదితర అంశాలపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. తహసీల్దారు కె. శ్రీనివాస శర్మ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి సమగ్ర భూ సర్వే కార్యక్రమం జరుగుతున్నట్లు తెలిపారు. దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. తమ శాఖల పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలను ప్రభుత్వ అధికారులు వివరించారు. వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కాకుమాను పెదనందిపాడు మండలంలోని ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథక అమలును బుధవారం ఎంఈఓ–2 జాకబ్ తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. ఎంఈఓ–1 కె.ఎఫ్.కెన్నడీ మాట్లాడుతూ హెచ్‌ఎంలు రోజూ మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడాలని తెలిపారు. ప్రభుత్వం అందించిన ఎనిమిది రిజిస్టర్లలో ఉన్న విధంగా భోజనాన్ని రుచిగా తయారు చేసే విధంగా కృషి చేయాలని ఆయన సూచించారు.

రోడ్లపై పశువులు సంచరిస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు



పొన్నూరు: పురపాలక సంఘం పరిధిలో రోడ్లపై పశువులు కనిపిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవులు, గేదెలు రోడ్లపై తిరగడం వల్ల తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. పారిశుద్ధ్య పనులకు కూడా ఆటంకం ఏర్పడుతోందని తెలిపారు. పశువులను రోడ్లపై వదిలివేయకుండా, సంరక్షణలో ఉంచుకోవాలని యజమానులకు సూచించారు. ఆదేశాలను పాటించని పక్షంలో పశువులను గోశాలకు తరలిస్తామని ఆయన పేర్కొన్నారు. సంబంధిత యజమానులపై చట్టపరమైన కేసులు కూడా నమోదు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

పురమిత్ర యాప్‌తో సేవలు సులభతరం

పట్టణ ప్రజలంతా పురమిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం ఈ యాప్‌ను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఇంటి, నీటి, ఖాళీ స్థలం పన్నుల చెల్లింపులతో పాటు 150 రకాల పౌర సేవలను ఈ యాప్ ద్వారా ఒకేచోట పొందవచ్చని వివరించారు. ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, ఈ సేవలను ఉచితంగా పొందవచ్చని ఆయన సూచించారు.

తరగతుల నిర్వహణతో చిన్నారులకు అవస్థలు


ఎంఈవోతో మాట్లాడుతున్న సీడీపీవో విజయలక్ష్మి

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తుండటం, బెంచీలను అంగన్‌వాడీ సెంటర్‌లో ఉంచడం వల్ల చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో జి. విజయలక్ష్మి ఎంఈవోకు సూచించారు. స్థానిక మండల విద్యావనరుల కార్యాలయంలో బుధవారం సాయంత్రం సీడీపీవో విజయలక్ష్మి పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. గొట్టిపాడు ఏవీఆర్ పాఠశాలలో టాయిలెట్‌ను అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించాలని కోరారు. వంగిపురం బీఎఫ్ఎస్ పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ప్రాథమిక పాఠశాల తరగతులు నిర్వహిస్తున్నారని, బెంచీలు కూడా అక్కడే పెట్టడం వల్ల చిన్నారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. స్పందించిన ఎంఈవో రమాదేవి మాట్లాడుతూ ఏవీఆర్ పాఠశాలలో హెచ్‌ఎంతో సమన్వయం చేసుకుని టాయిలెట్‌ను వినియోగించుకోవచ్చని చెప్పారు. వంగిపురం బీఎఫ్ఎస్ పాఠశాలలో భారీ వర్షాలు కురిసినప్పుడే సమస్య అని, హెచ్‌ఎంతో మాట్లాడతానని తెలిపారు. వెంట సూపర్‌వైజర్ తదితరులున్నారు.

కుక్కను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టిన కారు


హైవేపై అడ్డంగా ఉన్న ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ప్రత్తిపాడు: వేపై కుక్కను తప్పించబోయి కారు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలం నడింపాలెం పదహారవ నంబరు జాతీయ రహదారిపై బుధవారం ఉదయం గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు కారు దూసుకుపోతోంది. ఈ సమయంలో ఎదురుగా వచ్చిన కుక్కను తప్పించబోయి, ప్రమాదవశాత్తూ హైవే డివైడర్‌ను ఢీకొట్టింది. కారు ముందు భాగం దెబ్బతినడంతో, హైవే మధ్యలో అడ్డుగా ఆగిపోయింది. కారులో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సమీపంలోని కాటూరి ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని కారును పక్కకు తరలించి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

రూ. 16.25 లక్షల అపరాధ రుసుం వసూలు


దాడుల్లో పాల్గొన్న విద్యుత్ అధికారులు

గుంటూరు రూరల్: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ సీహెచ్. రమేష్ ఆధ్వర్యంలో బుధవారం విస్తృత తనిఖీలను నిర్వహించారు. చొడవరం, దాసరిపాలెం, చల్లావారిపాలెం, అంకిరెడ్డిపాలెం, పొత్తూరు, లాలుపురం గ్రామాల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్. వెంకటేశ్వరరావు, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి. శ్రీనివాసబాబుతో పాటు 51 మంది అధికారులు, 162 మంది సిబ్బంది కలిసి 51 బృందాలుగా ఏర్పడ్డారు. 3,768 సర్వీసులను తనిఖీ చేశారు. మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న నలుగురికి రూ 1.50 లక్షలు, అనుమతించిన లోడుకంటే అదనంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న 333 మందికి రూ 14.75 లక్షలు కలిపి మొత్తం రూ 16.25 లక్షల అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో డీఈఈలు కె. రవికుమార్, ఎస్. మల్లికార్జునప్రసాద్, బి. రాజమోహన్‌రావు, ఏఈలు కె. కోటేశ్వరరావు, ఎం.సతీష్‌కుమార్, శివశంకర్, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

ఏసీబీ ఎస్పీ మహేంద్ర మాతె


నూతన కెప్టెన్స్‌తో అతిథులు, పాఠశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థులు చిన్ననాటి నుంచి విద్యతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని అవినీతి నిరోధక శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏసీబీ) మహేంద్ర మాతె సూచించారు. బుడంపాడులోని ప్రాడిజీ విద్యాలయం సెరిమనీ వేడుకల్లో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్ నాయకత్వానికి పునాదులు ఏర్పడతాయని తెలిపారు. పాఠశాలలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను జరిపి విద్యార్థి నాయకులను ఎన్నుకోవడం అభినందనీయమని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలతో విద్యార్థులకు సమాజంపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. ఎక్కడైనా అవినీతిని గమనిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేసి సమాచారం అందించాలని ఆయన సూచించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన హెడ్ బాయ్, హెడ్ గర్ల్, నాలుగు హౌస్‌ల కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్, స్పోర్ట్స్ కెప్టెన్స్, తదితరులకు బ్యాడ్జిలు, శాషెస్, జెండాలను బహూకరించారు. అనంతరం నూతన కెప్టెన్స్ ప్రమాణ స్వీకారం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరింపజేశాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎం. శ్రీనివాసరావు, కరస్పాండెంట్ సూర్యకుమారి, ప్రిన్సిపల్ రథినిచౌదరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.వి రంగారావు


వైద్య సేవలను పరిశీలిస్తున్న రంగారావు తదితరులు

ప్రత్తిపాడు: వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.వి. రంగారావు హెచ్చరించారు. ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది పనితీరు, హాజరుతో పాటు ప్రజలకు అందిస్తున్న సేవలు, కాన్పులు సిజేరియన్‌ల వివరాలను హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌ను అడిగి తెలుసుకున్నారు. సాధారణ కాన్పులు, శస్త్ర చికిత్సల వివరాలను గైనకాలజిస్ట్ డాక్టర్ డి. విజయలక్ష్మి, పీడియాట్రీషియన్ డాక్టర్ సీహెచ్. నాగార్జున, అనస్థీషియా డాక్టర్ వర్షశ్రీలు డీసీహెచ్ఎస్‌కు వివరించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైద్యాధికారులు ఫేస్ రికగ్నిషన్ ద్వారా మాత్రమే హాజరు వేయాలని ఆదేశించారు. సమయపాలన పాటించుకున్నా, విధుల్లో అలసత్వం వహించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రత్తిపాడు ఆస్పత్రిలో ముగ్గురు వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేశామని, సీఎల్, ఈఎల్ నిలిపివేశామని వివరించారు. పనితీరులో మార్పు లేనిపక్షంలో సస్పెన్షన్ చేసేందుకు కూడా వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు.

ప్రైవేట్ ఆస్పత్రులకు పంపితే చర్యలు

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను టెస్టులు, స్కానింగులు, మెరుగైన వైద్యం అంటూ ప్రైవేటు హాస్పిటల్స్‌కు పంపిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని డీసీహెచ్ఎస్ బి.వి. రంగారావు హెచ్చరించారు. డెంటల్ ఓపీ కూడా ఈ హాస్పిటల్ లోనే నమోదు చేయాల్సిందేనని తెలిపారు. మాతశిశు సంరక్షణకు హాస్పిటల్‌లో నిష్ణాతులైన ఎంబీహెచ్ వైద్యుల బృందం ఉందని, వారి సేవలను ఈ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట హెచ్‌డీఎస్ మెంబర్ సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

గణిత సామర్థ్యాలపై దృష్టి పెట్టాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: విద్యార్థులలో గణిత సామర్థ్యాలను మెరుగుపరిచి వారిలో మేధో వికాసాన్ని పెంపొందించాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ నారు శ్రీనివాసరెడ్డి సూచించారు. బుధవారం అమరావతి రోడ్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన తొమ్మిదో రాష్ట్ర స్థాయి యూసీ ఎంఏఎస్(యూసీ మాస్) పోటీల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెయిన్ టెక్నాలజీ బిజినెస్ హెడ్ ఎం.శ్రీకాంత్ అధ్యక్షత వహించారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డి ప్రసంగాన్ని కొనసాగిస్తూ విద్యార్థులకు గణితంలో ఉత్తమ తర్ఫీదు ఇవ్వాలని చెప్పారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ గణితంతో వేగం, కచ్చితత్వాన్ని పెంపొందించవచ్చు అన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ సాహితీ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. వైవా స్కూల్ ప్రిన్సిపాల్ సరళాదేవి మాట్లాడుతూ అంక గణితానికి మానవ జీవితంలో ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. అనంతరం మూడు విభాగాలలో జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెయిన్ సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, రమ, అమర్నాథ్, నితిన్, పూజ, నందిని, మహాలక్ష్మి, లీల, మణి, జ్యోత్స్న, జ్యోతి, జీవన పాల్గొన్నారు.

సీసీఆర్సీ కార్డులతో పలు ఉపయోగాలు

పొన్నూరు: మండలంలోని మామిళ్లపల్లి, ఆరెమండ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులు తీసుకొని పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట బీమాలో పేరు నమోదుతో నష్టం వాటిల్లినప్పుడు సీసీఆర్సీ కార్డులు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రధాన మంత్రి ఫసల బీమా గడువు ఆగస్టు 15 వరకు ఉందని, ఎకరా వరి పైరుకు రూ. 800 ప్రీమియం చెల్లించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పి. మాణిక్యరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..

సీసీఆర్సీ కార్డులతో కౌలు రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని ఏవో సునీత అన్నారు. వట్టిచెరుకూరు మండలం చింతపల్లిపాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సీసీఆర్సీ కార్డులు, భూసార పరీక్షలు, పంటల సాగు, సేంద్రియ వ్యవసాయం, సస్యరక్షణ పద్ధతులు, రాయితీలపై ఏవో సునీత రైతులకు వివరించారు. అర్హత ఉండీ ఆసక్తి కలిగిన కౌలు రైతులు సీసీఆర్సీ కార్డుల కోసం రైతు సేవ కేంద్రం లేదా వీఆర్వోలను సంప్రదించాలని ఆమె సూచించారు. టీబీక్ 104, వీబీన్ 8 రకం మినుముల మినీ కిట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులకు నూరు శాతం రాయితీతో అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీహెచ్ఏ మోనాలిసా, రైతులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం

లక్ష్మీపురం: స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్పీఎఫ్ ఎస్ఐ శ్రీనివాసరావు, జీఆర్పీ ఎస్ఐ అనిత మాట్లాడుతూ ప్రధానంగా రైల్వే ప్రయాణికులు మానవ అక్రమ రవాణా జరిగిన ట్లు అనుమానం కలిగిన తక్షణమే ఉచిత హెల్ప్‌లైన్ నంబర్లు, 1098 లేదా1800 1027 222 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. క్రాఫ్ట్ జిల్లా కోఆర్డినేటర్ కోలా సమీర్ కుమార్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా వల్ల జరిగే ప్రమాదాలు, పిలలు మానవ అక్రమ రవాణాకు ఏ విధంగా గురవుతారు అనే విషయాలను ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

• మొక్క మొక్కకూ ప్రాణధార


డ్రమ్ముల్లో నీటిని నింపుతున్న రైతన్న


నీటి కుంట నుంచి ఇంజిన్లతో..


మొక్క మొక్కకూ నీటిని పోస్తున్న మహిళలు

ఈ ఏడాది మేలోనే మురిపించి ఖరీఫ్ సాగుపై ఆశలు రేకెత్తించిన వరుణుడు.. ఆ తరువాత ముఖం చాటేశాడు. జడివానలతో భూమి పదునెక్కి ఆశలు మొలకెత్తాల్సిన తరుణంలో.. మండే ఎండలు కర్షకుడికి క'న్నీరు'రు తెప్పిస్తున్నాయి. రెక్కల కష్టాన్నే పెట్టుబడిగా పెట్టే మట్టి మనిషి బేలగా ఆకాశం వైపు ఆశగా చూస్తున్న ఎదురు చూపులు ఎండధాటికి వడలిపోతున్నాయి. పగలు మండే ఎండలు.. సాయంత్రానికి కారు మబ్బులు కమ్ముకోవడం.. ఆ తరువాత మేఘాలు వాటిదారిన అవి వెళ్లిపోవడం. ఇదీ నిత్యం విచిత్ర పరిస్థితి. ఈ నేపథ్యంలో ఇప్పటికే పత్తి మొక్కలు విత్తిన రైతులు వరుణుడి జాడ కోసం నింగి వైపు ఆశగా చూస్తున్నారు. ఫలితం లేకపోవడంతో వ్యయప్రయాసలకోర్చి ఇదిగో ఇలా నీటి కుంటల నుంచి ఇంజిన్లు ద్వారా డ్రమ్ముల్లో నీటిని నింపుకుని, బిందెలు, బక్కెట్లుతో మొక్క మొక్కకూ నీటిని పోస్తూ బతికించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ చిత్రాలు ప్రత్తిపాడు శివారు తిక్కిరెడ్డిపాలెం సమీపంలో కనిపించాయి. దీంతో ఆదిలోనే కష్టాల సాగుకు బీజం పడినట్లయ్యింది.

–ప్రత్తిపాడు